క్లుప్తంగా

గణపవరం ఎంపీడీవోగా శ్రీలక్ష్మి



శ్రీలక్ష్మిని అభినందిస్తున్న సర్పంచ్‌లు

గణపవరం: గణపవరం ఎంపీడీవోగా బేబీ శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈమె కొయ్యలగూడెం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పనిచేసిన సూర్యనారాయణ సఖినేటిపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీలక్ష్మి గతంలో గణపవరం మండల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. శ్రీలక్ష్మిని గణపవరం మండల సర్పంచ్‌లు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ఈ- పంట నమోదు పరిశీలన



బొమ్మిడి ఆయకట్టులో పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉంగుటూరు: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కే హబీబ్ బాషా వెల్లమిల్లి, బాదంపూడి, బొమ్మిడిలో శనివారం ఈ పంట నమోదును పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెల్లమిల్లిలో ధాన్యం కొనుగోలుపై రైతులతో చర్చించారు. ధాన్యం కొనుగోలులో రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యం నిర్దేశించుకోవాలి

గణపవరం: విద్యార్థులు చదువుకుంటూనే వివిధ రంగాలపై అవగాహన పెంచుకోవడం అవసరమని గణపవరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలభాస్కరరావు అన్నారు. శనివారం గనపవరం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులకు సమగ్రశిక్ష, సెంటమ్ వర్క్ స్కిల్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్న్ షిప్‌లో భాగంగా గణపవరంలోని వస్త్ర దుకాణంలో వ్యాపారంపై అవగాహన కల్పించారు. వస్త్రాల కొనుగోలు, అమ్మకాలు, లాభ, నష్టాల తదితర అంశాలపై విద్యార్థినులకు వివరించారు. ఆంగ్ల ఉపాధ్యాయిని హిమగిరి, సైన్సు ఉపాధ్యాయిని బీహెచ్ సీత, ఒకేషనల్ ఉపాధ్యాయిని స్రవంతి, పది, ఇంటర్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ బదిలీ

దెందులూరు: దెందులూరు మండల పంచాయతీలు విస్తరణాధికారి తిరుపతి స్వామి నిడమర్రు మండల పంచాయతీలు విస్తరణాధికారిగా బదిలీ అయ్యారు. శనివారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో దెందులూరు మండల పంచాయతీలు విస్తరణ అధికారిగా ఎవరినీ నియమించలేదు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతవ్వాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పోతునూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సీతంపేట గ్రామంలో ప్రధాన వీధుల్లో ఫాగింగ్ చేశారు.

నేడు నర్సింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

దెందులూరు: దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య సేవలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ సిగ్గు శెట్టి నూకరాజు తెలిపారు. శనివారం దెందులూరు కళాశాలలో ఆయన మాట్లాడుతూ సుగర్, బీపీ, థైరాయిడ్, అధిక బరువు, జాయింట్ పెయింట్స్, రక్తహీనత, మోకాళ్ల అరుగుదల, మూలశంక, గ్యాస్టిక్ సమస్యలు, ఇతర సమస్యలు ఉన్నవారు ఉచిత వైద్య అవగాహన సదస్సుకు హాజరు కావాలన్నారు, వచ్చేటప్పుడు తమకున్న అనారోగ్య సమస్యలకు సంబంధించి రక్త పరీక్షలు నివేదికలు తీసుకు రావాలని నూకరాజు కోరారు.

ఓటరు జాబితా సిద్ధం

నిడమర్రు: ఉభయగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవడంతో దాన్ని భర్తీ చేసేందుకు నిర్వహించనున్న ఉప ఎన్నికల్లో నిడమర్రు మండలం నుంచి అందిన దరఖాస్తులు పరిశీలన అనంతరం ప్రకటించిన ముసాయిదా జాబితాలో 18 మంది టీచర్స్ ఉన్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. ప్రకటించిన జాబితా నిడమర్రు తహసీల్దారు కార్యాలయంలో అందుబాటులో ఉందన్నారు. ఈ 18 మంది టీచర్స్ ఓటర్లు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 15 వరకు స్వీకరిస్తామన్నారు. 30వ తేదీన అభ్యంతరాలపై పరిశీలన ఉంటుందన్నారు. నవంబరు 6వ తేదీన తుది జాబితా ప్రకటన ఉంటుందని తాహసీల్దారు నాగరాజు తెలిపారు.

కొనలేం.. తినలేం

- కన్నీళ్లు రప్పిస్తున్న ఉల్లి
- అదే బాటలో చికెన్, కోడిగుడ్లు
- పెరిగిన కూరగాయలు, పప్పుల ధరలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

పెదవేగి: ఒక్కసారిగా పెరిగిన కూరగాయలు నిత్యవసర సరుకుల ధరలతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్య పోషికాహారం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు బలవర్ధక ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో మాంసాహారం, కోడిగుడ్ల వినియోగం పెరిగి వాటి ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. కరోనా విపత్కర పరిస్థితుల తరువాత కొన్ని రంగాలు చతికిలపడి పోగా, కొందరు ఉపాధిని సైతం కోల్పోయారు. ఇల్లు గడవడమే కష్టంగా ఉన్న సమయంలో అన్నింటి ధరలు పెరిగిపోతుండడం సామాన్యులకు భారంగా మారింది. ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు.

పెరిగిన కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు

నిత్యవసరాలు అడ్డూఅదుపు లేకుండా పెరిగిన వేళ, కూరగాయలకు డిమాండ్ ఏర్పడి వాటి ధరలు పెరిగాయి. దీనికి తోడు అధిక వర్షాలు కురవడంతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడం, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా చార్జీల భారం కూరగాయలపై పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో కూరగాయల ధరలు కిలో రూ.30 నుంచి రూ.40లోపు ఉండేవి. కాని ఇప్పుడు కిలోకు రూ.60 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. టమాటా రూ.20లోపు ఉండాల్సిన సమయంలో ప్రస్తుతం రూ.50 నుంచి రూ.70 పలుకుతోంది. వంకాయ, బెండ, కేరట్, బీరకాయ వంటి కూరగాయలు కిలో రూ.60 పైబడి పలుకుతున్నాయి. మిర్చి చిక్కుడుకాయలు కిలో రూ.100 చొప్పున అమ్ముతున్నారు వీటికి తోడైనట్టుగా వంటనూనె రూ.100 వరకు అమ్మేది ప్రస్తుతం రూ.120 వరకు అమ్ముతున్నారు. కందిపప్పు రూ.100 నుంచి రూ.110కి పెరిగింది. అన్ని పప్పుల ధరలు రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగాయి. వంట నూనెల ధరలు మండిపోతున్నాయి. ఉల్లిపాయలు ధర రికార్డు స్థాయిలో పెరుగుతోంది. నిన్న, మొన్నటి వరకు రూ.35 ఉన్న ఉల్లి ధర ఇప్పుడు రూ.50కు పైగా పెరిగి కొనుగోలుదారులకు కన్నీరు పెట్టిస్తోంది.

మాంసాహారం అధిక భారం

కూరగాయల ధరలు మండిపోతుంటే, మరోవైపు చికెన్, కోడిగుడ్డు, మటన్ ధరలు కొండెక్కి కూర్చోవడంతో మాంసాహార ప్రియులకు నోట్లోకి ముక్కపోని పరిస్థితి ఏర్పడింది. చికెన్ ధర కిలోకి రూ.206, లైవ్ కోడి రూ.142 వరకు పలుకుతోంది. మటన్ కిలో రూ.700 నుంచి రూ.1000 వరకు ధర పెరిగింది. కోడిగుడ్డు రూ.4 వరకు ఉండగా అది ఇప్పుడు ప్రాంతాల వారీగా రూ.6 నుంచి రూ.6.50 వరకు విక్రయిస్తున్నారు. సరుకులు, కూరగాయలకు ఎక్కువ ధరలు వెచ్చించలేక పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ధరలను నియంత్రించాలి



కూరగాయలు, పప్పులు, నూనెలు ఇంట్లో నిత్యం వాడాల్సినవే. వీటి ధరలు పెరుగుతుండడం, ఉల్లిపాయల ధర పెరగడం వల్ల ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది. పెరుగుతున్న అధిక ధరలను నియంత్రించాలి.

– మాత్రపు తేరేజమ్మ, జగన్నాథపురం

ఇష్టమైన కూరలు తినలేని స్థితి



భోజనానికి కూర తయారు చేయాలంటే భయమేస్తోంది. కూరగాయలు, పప్పులను కొనలేకపోతున్నాం. ఇష్టమైన కూరలు తినే పరిస్థితి లేదు. ధరలు విపరీతంగా పెరిగిపోతే సామాన్య,మధ్యతరగతి ప్రజలు బతికేది ఎలా?

– అక్ష దామేశ్వరి, ముందూరు, గృహిణి

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు అధికం



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన గంటా పండు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం మంగళగిరి ఆయన నివాసంలో ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి కారుమూరు సునీల్ కుమార్‌తో కలిసి కొమరేపల్లి వైఎస్సార్‌సీపీ నేత గంటా పండు కలిశారు. సీతంపేట, కొమరేపల్లి గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు శిలాఫలకాలు, ఆటోలు ధ్వంసం చేశారని, క్రియాశీలకంగా ఉండే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. టీడీపీ శ్రేణులు ఏం చేసినా ఎంతకు తెగించినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏకపక్షంగా వైఎస్ జగన్ వెంటే ఉంటారని పండు అన్నారు. వచ్చేది మంచి రోజులేనని అందరూ ధైర్యంగా ఉండాలని మీ అందరికీ అండగా అన్నివేళలా ఉంటానని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారని పండు తెలిపారు. ఏలూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ పి విజయబాబు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయండి



ధాన్యం కొనుగోలుపై అధికారులకు సూచనలిస్తున్న జేడీ వెంకటేశ్వరరావు

గణపవరం: అన్ని గ్రామాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే సిద్ధం చేయాలని, ధాన్యం కొనుగోలు పారదర్శకంగా రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం గణపవరం మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కొనుగోలు విధానం, గోదాముల వివరాలను ఆయన సిబ్బందికి వివరించారు. ధాన్యం కొనుగోలుపై ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అధికారులంతా హమాలీలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు, గోనెలు వంటివి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏవో యర్రంశెట్టి ప్రసాద్, తహసీల్దార్ అప్పారావు, ఎంఎల్‌వో దాస్, వీఏఏలు, వీఆర్‌వోలు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న జాతీయ రహదారి, రైల్వే సమస్యలను శనివారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ దృష్టికి మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు తీసుకుని వెళ్లారు. 39 కిలోమీటర్ల జాతీయ రహదారి పరిధిలోని నియోజకవర్గంలోని భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల, కైకరం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాల వెంబడి హైవే వెళ్తుండగా ఈ గ్రామాల వద్ద ఎటువంటి రైల్వే క్రాసింగ్ పాయింట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. సర్వీసు రోడ్డు కలిగిన పై వంతెనలను నిర్మించాలని కోరారు. భీమడోలు రైల్వే గేటు వద్ద నిర్మించే పై వంతెనను అయ్యప్ప స్వామి ఆలయం గల పుంత వైపుకు మార్చాలని కోరారు. కైకరం వద్ద పై వంతెన సమస్యలపై మాజీ జెడ్పీటీసీ చింతల వాసుతో పాటు న్యాయవాదులు ఎంపీకి వివరించారు. సమస్యలన్నింటిని జాతీయ రహదారి, రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

వృద్ధులను ఆదుకోవాలి

దెందులూరు: వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని జోగన్నపాలెం కరుణా మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ చిన్న విజయ్ మోహన్ పాల్ అన్నారు. శనివారం వృద్ధాశ్రమంలో చిన్న విజయ్ మోహన్‌పాల్ మాట్లాడుతూ గిరిజన, గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న ఆదరణ కోల్పోయిన వృద్ధులకు తమ కరుణాశ్రమ సేవలందిస్తుందన్నారు. వృద్ధాప్యంలో ఉన్న ఆధారం లేని వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విజయ్ మోహన్‌పాల్ అన్నారు.

హౌసింగ్ ఏఈగా వివేకానంద

దెందులూరు: దెందులూరు మండలం హౌసింగ్ ఏఈగా టీ.వివేకానంద శనివారం ఆయన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ వీ.శ్రీలత ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

సచివాలయ కార్యదర్శిని కలిసిన బండారు

ఉంగుటూరు: నారాయణపురం-1 సచివాలయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్‌ను ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శనివారం నాగరాజుతోపాటు ఎంపీటీసీ అలివేలి మహాలక్ష్మి దానయ్య, పైడి వరప్రసాదులు విజయకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గిరీష్‌కు అపూర్వ స్వాగతం

ఉంగుటూరు: ఎయిర్ ఫోర్సులో రెండు దశాబ్దాలు సేవలు అందించిన బండారు గిరీష్‌కు శనివారం ఉంగుటూరులో ఘన స్వాగతం లభించింది. సర్జంట్ క్యాడర్‌లో ఆయన పదవీ విరమణ చేశారు. శనివారం గ్రామానికి వచ్చిన గిరీష్‌కు స్నేహితులు, గ్రామస్తులు పూల మాలలువేసి స్వాగతించారు.


చికిత్స పొందుతూ మహిళ మృతి

పెదవేగి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం నాగన్నగూడెం గ్రామానికి చలపాటి రత్నకుమారి సెప్టెంబర్ 29న నాగన్నగూడెం చెరువు దగ్గర రోడ్డు దాటుతుండగా, వీరంపాలెం నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రత్నకుమారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యచికిత్స కోసం విజయవాడ తరలించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ రత్నకుమారి (50) శనివారం మృతి చెందినట్లు విజయవాడ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు



పూళ్లలో అన్నపూర్ణదేవిగా భవానీ మాత



మందలపర్రులో అన్నపూర్ణదేవీగా దుర్గమ్మ

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం అమ్మవారు భక్తులకు వివిధ రూపాలల్లో దర్శనమిచ్చారు. చలువ పందిళ్లల్లో కొలువైన అమ్మవార్లకు, ఆలయాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లోని దుర్గా మాతను దర్శించుకున్నారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు చెందిన రూ.6 లక్షల కరెన్సీతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానీ మాత అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. నరెడ్లగూడెంలో గద్దెపై ఉన్న అమ్మవారికి విశేష పూజలు చేశారు. గుండుగొలనులోని వేంకటేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భీమడోలు గోదావరి కాలువ గట్టుపై వేంచేసియున్న అమ్మవారి భారీ విగ్రహానికి విశేష పూజలు చేశారు.

కరుణించమ్మ..అన్నపూర్ణమ్మ

నిడమర్రు: కరుణించమ్మ... కాపాడమ్మ అన్నపూర్ణమ్మ అంటూ మండలంలోని దుర్గామాత మండపాలు, ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. మందలపర్రు పంచాయతీన క్షేత్రం, పెదనిండ్రకొలను, బువ్వనపల్లి, పత్తేపురం, చానమిల్లి, క్రొవ్విడి, బావాయిపాలెం గ్రామాల్లో కొలువైన దుర్గామాత శనివారం అన్నపూర్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, రాత్రి ఆయా వేదికల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పెదవేగిలో రగ్బీ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు

పెదవేగి : ఆంధ్రప్రదేశ్ అండర్ 19 ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైందని ఏపీ ఎస్‌జీఎఫ్ పర్యవేక్షకుడు కె నాగలింగేశ్వరరావు అన్నారు. పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల ప్రాంగణంలో శనివారం అంతర్ జిల్లాల రగ్బీ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలను పర్యవేక్షిస్తున్న ఏపీ ఎస్‌జీఎఫ్ పర్యవేక్షకులు నాగలింగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 144 మంది క్రీడాకారులు, 25 మంది కోచ్ మేనేజర్, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొని రగ్బీ పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె జయరాజు, స్థానిక పీఈటీ గురుమూర్తి, తదితరులు ఉన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఎన్‌సీసీ శిక్షణ చక్కని సోపానం



భీమడోలులో ఎన్‌సీసీ విద్యార్థులతో కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎన్‌సీసీ సిబ్బంది

భీమడోలు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎన్‌సీసీ చక్కని మార్గమని 19(ఏ) బెటాలియన్ హవల్దార్లు సింగ్, కుస్వంత్ సింగ్ అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలకు చెందిన 25 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రాసిన బీ గ్రేడు పరీక్షల్లో చక్కని ప్రతిభను చాటి నూరుశాతం ఉత్తీర్ణతను సాధించారు. భీమడోలు కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్స్ బొమ్ము రవికుమార్, ఏ.మాధవితో కలిసి హవల్దార్లు వారికి సర్టిఫికెట్లను అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లకు రిజర్వేషన్లు ఉంటాయన్నారు. సెకండ్ ఇయర్ బీకాం విద్యార్థి, ఎన్‌సీసీ విద్యార్థి జి.అశోక్‌చక్రి వచ్చే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం రావడంతో నవంబర్‌లో కాకినాడలో శిక్షణ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం 25 మంది ఉత్తీర్ణత సాధించడంతో వారిని ప్రిన్సిపల్స్ రవికుమార్, మాధవి, ఎన్‌సీసీ అధికారి కె.శివశంకర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనా ఫలాలు రైతులకు అందాలి

పెదవేగి : పరిశోధనా ఫలాలు రైతులకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం ఎం.ఆర్.సి కాలనీలోని ఆయిల్ ఫామ్ రీసెర్చ్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సందర్శించారు. రీసెర్చ్ సెంటర్ లోని సమావేశ మందిరంలో శాస్త్రవేత్తలతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసెర్చ్ సెంటర్ ద్వారా చేపట్టిన ప్రయోగాలను శాస్త్రవేత్తలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వివరించారు. చాక్లెట్ తయారీ కంపెనీలు స్థాపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ చెప్పారు. అనంతరం రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను రైతులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దారుగా పూర్ణచంద్రరావు



డిప్యూటీ తహసీల్దారు పూర్ణ చంద్రరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ఉంగుటూరు: ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దారు వై.పూర్ణ చంద్రరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎన్నికల డీటీ పోతురాజు, ఇతర ఉద్యోగులు వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పూర్ణచంద్రరావు కలెక్టరేట్‌లో ఇప్పటి వరకు పనిచేశారు. తహసీల్దారు లేకపోవడంతో పూర్ణచంద్రరావుకు పూర్తి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన బొడ్డేపల్లి ప్రసాదు నిడమర్రు డీటీగా బదిలీపై వెళ్లారు.

తెలుగు అభివృద్ధికి పట్టుగొమ్మలు కళా సంస్థలు



కేవీఎస్ సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు భాషాభివృద్ధికి కళా సంస్థలు పట్టుగొమ్మలని, ఈ తరానికి చెందిన వారు తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. నగరానికి చెందిన సాహిత్య మండలి, కేవీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన శరన్నవరాత్రుల సాహిత్యోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూచిపూడి నృత్య దర్శకులైన కేవీ సత్యనారాయణ ప్రపంచ వ్యాప్తంగా బహు శిష్యులను కలిగిన గురువుగా ఖ్యాతిగాడించారని, వీరు ప్రతి ఏటా నృత్య, సాహిత్య, సంగీత రంగాలలో విశిష్టమైన వారికి అవార్డులను బహూకరించడం ఎంతో గొప్ప పరిణామమని కొనియాడారు. అనంతరం మడుపల్లి మోహన్ గుప్తా సౌజన్యంతో ఏర్పాటు చేసిన తాతా సందీప్ శర్మ అష్టావధానం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ప్రముఖ అవధాని 'పద్యకళాతపస్వి' ఆచార్య ధూళిపాళ మహాదేవమణికి, 2024 పురస్కారాన్ని తాతా సందీప్ శర్మకు కేవీఎస్ సాహిత్య పురస్కారం 2023ను బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. తొలుత నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ పక్షాన బుద్ధ ప్రసాద్‌ను సత్కరించారు. సభకు కేవీ సత్యనారాయణ అధ్యక్షత వహించగా సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం స్వాగతం పలికారు.